సాక్షి
నారాయణపేట
ఆదివారం । 18 । జూన్ । 2023



నీటిగోసకు స్వస్తి
ప్రత్యేక రాష్ట్రంలో 'మిషన్ భగీరథ' పథకంతో తాగునీటి ఇబ్బందులు తొలగాయి.
వివరాలు 8లో ▸



ఆర్టీసీ సదవకాశం
ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ కొత్తగా టీ–9 టికెట్‌ను అందుబాటులోకి తెచ్చింది.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
38.7 /24.7
రోజంతా ఎండ తీవ్రత ఉంటుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమవుతుంది. గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నారాయణపేట రూరల్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో శనివారం ముగిశాయి. చివరి పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 12 పరీక్ష కేంద్రాల్లో మొదటి సంవత్సరం జనరల్‌లో విభాగంలో 1,916కి గానూ 1,844మంది హాజరయ్యారు. 72మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 21కి 14మంది పరీక్ష రాశారు. అదేవిధంగా సెకండ్ ఇయర్‌లో జనరల్ 647కి 621, ఒకేషనల్‌లో 16కి 14మంది పరీక్షకు హాజరయ్యారు.

గణితం పరీక్ష ప్రశాంతం..

జిల్లా వ్యాప్తంగా 8 పరీక్ష కేంద్రాల్లో టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించగా శనివారం జరిగిన గణితం పరీక్షకు పెద్దసంఖ్యలో విద్యార్థులను కేటాయించారు. రెగ్యులర్ పరీక్షలో ఎక్కువ శాతం విద్యార్థులు గణితంలో ఫెయిల్ అయ్యారు. 1,705 మందిని కేటాయించగా 1,637మంది పరీక్షకు హాజరయ్యారు. 68మంది గైర్హాజరయ్యారు.

ఎస్‌జీఎఫ్ కార్యదర్శిగా నర్సింహులు



నారాయణపేట రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నూతన కార్యదర్శిగా నర్సింహులు నియమితులయ్యారు. గతంలో పనిచేసిన రాం కళ్యాణ్ 317జీఓలో జిల్లా నుంచి వెళ్లి పోవడంతో అప్పటి నుంచి ఖాళీగా ఉంది. తాజాగా ఊట్కూర్ జెడ్పీ స్కూల్లో విధులు నిర్వహిస్తున్న ఫిజికల్ డైరెక్టర్ నర్సింహులును కొత్త సెక్రెటరీగా నియమిస్తూ డీఈఓ రవిందర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేర్‌కృష్ణారెడ్డి, నర్సింహ అభినందించారు. అనంతరం నర్సింహులు మాట్లాడుతూ జిల్లాలో క్రీడల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, అన్ని క్రీడాపోటీలు అందరి సమన్వయంతో నిర్వహిస్తానని చెప్పారు. కార్యక్రమంలో రిటైర్డ్ పీఈటీ నర్సింహులు, రత్నయ్య, రమణ, బాలరాజు, సాయినాథ్, అనంతసేనా, మౌలాలి, రాజశేఖర్, వేణుగోపాల్, పారిజాత, రమేష్, శశికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

గుండెపోటుతో రమేశ్‌గౌడ్ మృతి



నారాయణపేట: రాష్ట్ర గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బొబ్బిలిపులి రమేశ్‌గౌడ్ (64) గుండెపోటుతో హైదరాబాద్‌లోని తన నివాలంలో శనివారం మృతి చెందారు. ఊట్కూర్‌కు చెందిన రమేశ్‌గౌడ్ ఉమ్మడి పాలమూరు జిల్లాలో రెండు పర్యాయాలు గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 1983లో ఎన్టీఆర్ టీడీపీని వ్యవస్థాపించడంతో దివంగత మాజీ మంత్రి ఎల్కోటి ఎల్లారెడ్డితో కలిసి ఎన్టీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఆదివారం నారాయణపేటలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రముఖుల ప్రగాఢ సంతాపం

బొబ్బిలి రమేశ్‌గౌడ్ కుటుంబానికి రాష్ట్ర గీత కార్మిక పారిశ్రామిక సహకార సంఘం కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవి, స్పోర్ట్ అథారిటీ రాష్ట్ర చైర్మన్ ఆంజనేయులుగౌడ్, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజుగౌడ్, నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వనజమ్మ, బీజేపీ రాష్ట్ర నేత నాగూరావునామాజీ, రతంగ్‌పాండురెడ్డి తదితరులు కుటుంబానికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

పరేడ్‌తో శారీరక దృఢత్వం

నారాయణపేట రూరల్: పోలీసుల ఆరోగ్యం ఎంతో ముఖ్యమైందని, అందుకు ప్రతి ఒక్కరూ వీక్లీ పరేడ్‌లో భాగస్వాములు కావాలని అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయ మైదానంలో శనివారం వీక్లీ పరేడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి పోలీసు నిత్యం వ్యాయామం చేయాలని, వారానికి ఒకసారి పరేడ్ నిర్వహించడంతో శారీరక దృఢత్వాన్ని పొందవచ్చన్నారు. అలాగే పోలీసులు ఉపయోగించే ఆయుధాల గురించి అవగాహన కల్పించారు. అలాగే నీట్ టర్న్ అవుట్ కలిగి ఉండాలన్నారు. సమయపాలన, క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలన్నారు. సర్వీసులో ఏమైనా సమస్యలు ఉంటే ఎస్పీని కలిసి పరిష్కరించుకోవాలన్నారు. అంతకుముందు గౌరవ వందనం స్వీకరించారు. డీఎస్పీ సత్యనారాయణ, ఆర్ఐ విజయ్‌కుమార్, కృష్ణయ్య, ఇందిర, చంద్రశేఖర్, రిజర్వుడ్ జిల్లా పోలీసులు పాల్గొన్నారు.

నవమాసాలు మోసి అమ్మ ప్రాణం పోస్తే..
ఆ జీవనానికి జీవితం ఇచ్చేది నాన్న..
నీతికి, నిజాయితీకి నిదర్శనం నాన్న..
ఆపదలో ఆసరాగా నిలిచే నేస్తం నాన్న..
ప్రపంచమంతా నీకు వ్యతిరేకంగా ఉన్నా..
ఓడిపోయినప్పుడు నేనున్నా అని వెన్నంటి
ఉంటూ ధైర్యం చెప్పేది నాన్న..
గెలిచినప్పుడు పదిమందికి చెప్పుకొని
ఆనందపడేది నాన్నే.. ఇలా నాన్న గురించి
ఎంత చెప్పినా తక్కువే.. పిల్లల అభ్యున్నతి
కోసం అనుక్షణం ఆరాటపడుతూ.. తాను
కొవ్వొత్తిలా కరిగిపోతూ కన్నబిడ్డల జీవితాల్లో
వెలుగులు నింపాలనుకుంటాడు నాన్న.

నేడు ప్రపంచ తండ్రుల దినోత్సవం



నాన్నే స్ఫూర్తి.. చెదరని కీర్తి

జీవిత పాఠాల్లో తండ్రికి మించిన గురువు లేరు

- పిల్లల ప్రతి అడుగులో వెన్నంటి ఉంటూ భరోసా
- తప్పులను సరిదిద్దుతూ.. మంచీ, చెడుల వ్యత్యాన్ని తెలియజేసే స్నేహశీలి
- భవితకు మార్గదర్శిగా ఉంటూ.. వారి ఎదుగుదలకు అహర్నిశలు కష్టపడే శ్రమజీవి

'ఏ కష్టమెదురొచ్చినా.. కన్నీళ్లే ఎదురించినా.. ఆనందం అనే ఉయ్యాలలో నను పెంచిన.. నాన్నకు ప్రేమతో.. అంకితం నా ప్రతిక్షణం.. అంటూ సాగే సినీ గేయం పిల్లల పెంపకంలో తండ్రి పాత్రను చక్కగా వివరిస్తుంది. నవ మాసాలు మోసి.. కనిపెంచే తల్లితో పాటే సమాజంలో బతకడం నేర్పించే తండ్రి పాత్ర కూడా కీలకమే.' 'కష్టాన్ని కళ్ల కింద దాచిపెట్టి.. సంతోషాన్ని చేతినిండా పంచిపెట్టే వాడే నాన్న.. తన కోసం ఏదీ దాచుకోకుండా త్యాగాలకు ప్రతిరూపం తండ్రి. స్వార్థం లేని ప్రేమతో గుండెలపై ఆడించి.. బతుకు దారి చూపే మార్గదర్శి, కష్టాల్లో నిబ్బరంగా, ఆపదలో ధైర్యంగా నిలబడేలా చూసేది నాన్నే. కన్నబిడ్డల ఎదుగుదలకు అహర్నిశలు కష్టపడే శ్రమజీవి తండ్రి. అందుకేనేమో బిడ్డ ఎంత ఎత్తుకెదిగినా అంత కంటే నాన్న పైమెట్టులోనే ఉంటాడు. ఉమ్మడి జిల్లాలో ఉన్నతస్థాయికి ఎదిగేందుకు పలువురు ప్రముఖులు తమ విజయంలో వారి తండ్రి పాత్రను గుర్తు చేసుకున్నారు. ఆదివారం ఫాదర్స్‌డే సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

– సాక్షి, నాగర్‌కర్నూల్/పాలమూరు/వనపర్తి/గద్వాల రూరల్/నాగర్‌కర్నూల్/నారాయణపేట/అచ్చంపేట రూరల్/గద్వాల క్రైం

కొండంత అండ..

ప్రతిఒక్కరి జీవితంలో నాన్న తానే సర్వస్వమై అన్ని విషయాలను చూసుకుంటారు. తన పిల్లలు ఉన్నతంగా ఎదిగేందుకు నిరంతరం తపన పడతారు. మా నాన్న పేరు గంగాధర్. మా అన్నదమ్ములిద్దరికీ ఆయనే కొండంత అండ. చిన్నప్పటి నుంచి ప్రతి విషయంలో మాకు తోడుగా ఉన్నారు. చదువులోనూ, ఉద్యోగ సాధనలోనూ ప్రోత్సాహం ఇచ్చారు. ప్రతి దశలో మాలో ఆత్మవిశ్వాసం నింపారు. నాన్నలందరికీ ఫాదర్స్ డే శుభాకాంక్షలు.

– ఉదయ్‌కుమార్, కలెక్టర్, నాగర్‌కర్నూల్



తండ్రి స్ఫూర్తితోనే ముందడుగు

మనం ఎంచుకున్న మార్గం సరైనది అయినప్పుడు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని నిక్కచ్చిగా ముక్కుసూటిగా చెప్పే మనస్తతత్వం ఉన్న మా నాన్నే నాకు స్ఫూర్తిదాయకం. అదే స్ఫూర్తితోనే భిన్నమైన రాజకీయాలకు పెట్టింది పేరుగాంచిన నడిగడ్డలో వెనకడుగు వేయకుండా ముందుకు సాగుతున్నాను. మాది కొత్తూరు మండలం, సిద్దాపూర్ గ్రామం. మా గ్రామానికి బస్సు సౌకర్యం కూడా లేని పరిస్థితిలో మా నాన్న కృష్ణయ్య చదువు విలువ తెలుసుకుని కష్టపడి చదువుకుని వ్యవసాయ శాఖలో ఏఈఓగా పనిచేశారు. క్రమశిక్షణకు మారుపేరుగా ఉన్న మా నాన్న అదే నిబద్ధతతో మమ్మల్ని సైతం చదవించారు. ప్రస్తుతం మా అక్క ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తుండగా.. నేను బీఎస్సీ (మైక్రోబయాలజీ) చదివా. మానాన్న చెప్పిన మాటలే నాకు ప్రస్తుతం రాజకీయాల్లో ఎదురవుతున్న కొన్ని క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనే ధైర్యాన్ని ఇచ్చింది. ఓ సందర్భంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయయాదవ్ కలిసినప్పుడు మా నాన్నకున్న క్రమశిక్షణ, నిబద్ధత గురించి అక్కడున్న నాయకులు, కార్యకర్తలకు చెప్పడం సంతోషించాను. దురదృష్టవశత్తు మా నాన్న ఓ ప్రమాదంలో మృతిచెందినా.. ఇప్పటికీ ఆయనే నాకు స్ఫూర్తి. అందరికీ ఫాదర్స్ డే శుభాకాంక్షలు.



తల్లిదండ్రులతో గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

నాన్న ప్రోత్సాహంతోనే



వ్యాపార రంగంలో, రాజకీయంలో నేను ఈ స్థాయికి రావడానికి నాన్న మర్రి జంగిరెడ్డి ప్రోత్సాహమే కారణం. వ్యాపారంలో గాని, రాజకీయాల్లో గాని ఆరంగ్రేటం చేసేటప్పుడు వెన్నుతట్టి ప్రోత్సహించారు. చిన్నతనంలో ఎంతో కష్టపడి మమ్మల్ని పెంచారు. అందుకే తండ్రి పేరుతో ఎంజేఆర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపడుతున్నా. తండ్రి పేరుపై ట్రస్టు ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేయ డం నా అదృష్టంగా భావిస్తున్నా.

– మర్రి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే, నాగర్‌కర్నూల్

స్ఫూర్తిప్రదాత..

మా నాన్నే మాకు స్ఫూర్తిప్రదాత. తాను ఎప్పుడూ తన బిడ్డలు గొప్ప చదువులు చదివి.. ఉన్నత స్థాయిలో నిలబడాలని ఆకాంక్షించేవారు. మా నాన్న ప్రోత్సాహంతోనే ఈ రోజు సివిల్స్‌లో జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు సాధించా. ప్రజలకు సేవ చేయాలంటే సివిల్స్ సర్వీసెస్‌నే అత్యుత్తమ మార్గమని నాన్న సూచనలతోనే ఈ రోజు ఈ విజయం సాధించా. మా తాత సైదులు టీచర్. మా నాన్న ఎస్పీ. నేను ఈ రోజు ఐఏఎస్ కావడం ఎంతో సంతోషంగా ఉంది.

– ఉమాహారతి, సివిల్స్ ర్యాంకర్



మంచి స్నేహితుడు కూడా..

చిన్నప్పటి నుంచి సమాజంలో ఎలా జీవించాలి.. వ్యాపారం ఎలా చేయాలో నేర్పించడంతోపాటు ఓ స్నేహితుడిలా ప్రోత్సహించారు. నాన్న తనకు 90 ఏళ్ల వచ్చినా ఇప్పటికీ సలహాలు ఇస్తూనే ఉంటారు. నేడు పల్లీ వ్యాపారం అంతర్జాతీయ స్థాయిలో చేస్తున్నానంటే.. మా నాన్న ఇచ్చిన ధైర్యం , ఆయన చూపించిన వ్యాపార మార్గమే ప్రధాన కారణం. ఆయన సలహాతోనే రాజకీయాల్లోకి వచ్చి వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్‌గా, ప్రస్తుతం జిల్లా పరిషత్ చైర్మన్‌గా కొనసాగుతూ.. ప్రజలకు సేవ చేస్తున్నా. ఫాదర్స్‌డే సందర్భంగా జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి తన తండ్రి నారాయణ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.



ఉత్తమ పౌరులుగా..

మారుతున్న కాలంతో పాటు అన్నింటా పెరుగుతున్న పోటీ మానవ జీవనాన్ని సంక్లిష్టం చేస్తున్నాయి. ఈ క్రమంలో పిల్లలను మంచి పౌరులుగా తీర్చాలనే తపన ప్రతి తండ్రిలో కనిపిస్తోంది. ఈ రోజుల్లో పిల్లలు చదువురీత్యా తల్లిదండ్రులకు దూరంగా ఉండటం సాధారణమైంది. తండ్రి తోడ్పాటుకు దూరమైన పిల్లల్లో భవిష్యత్ నిర్మాణం సక్రమంగా ఉండటం లేదు. ఇలాంటి వారిలో ఆత్మగౌరవం నశించడం, ప్రవర్తనలో మార్పు, చెడు వ్యసనాలకు బానిస కావడం వంటివి కనిపిస్తున్నాయి. అందువల్ల పిల్లలపై తండ్రి పర్యవేక్షణ నిరంతరం అవసరం.



– డాక్టర్ వంగీపురం శ్రీనాథాచారి, మానసిక వ్యక్తిత్వ వికాస నిపుణులు

నడిపించింది.. నాన్నే

తన బాధ్యతలను సాధికారతతో నిర్వహించే వ్యక్తిత్వం.. ఎంత స్వేచ్ఛ ఇవ్వాలో.. ఎక్కడ నియంత్రించాలో తెలిసిన వ్యక్తి ఎవరైన ఉన్నారంటే అది మా నాన్న కరణం శ్రీకాంత్. తండ్రి నేర్పిన క్రమశిక్షణ, ప్రేమ, సొంత నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సాహం ఇచ్చారు. నా చిన్నతనంలోనే తల్లి ప్రేమకు దూరమైన క్షణంలో నాన్నే నా చేయి పట్టుకుని నడిపించాడు. పాఠశాల, కళాశాల చదువుతున్న సమయంలో అండగా నిలబడి ఇష్టాఇష్టాల్ని గౌరవించి సందేహాలు తీర్చారు. ఏ విషయమైనా పంచుకునే స్వేచ్ఛా వాతావరణం మా మధ్య ఉండేది. నాన్న ఇచ్చిన ధైర్యంతోనే ఈ రోజు పోలీసు శాఖలో ఎస్పీ స్థాయికి ఎదిగి.. ప్రజలకు సేవచేస్తున్నా. నా బలహీనత.. బలాలు ఏంటో గుర్తిస్తే.. అవి తప్పకుండా మా నాన్నే ఉంటారు.



– సృజన, గద్వాల ఎస్పీ

అన్నీ.. తానై



సుమారు 28 ఏళ్ల క్రితం భార్య చనిపోయింది. ఉన్న ముగ్గురు పిల్లలూ చిన్నవాళ్లు. వారికి అన్నీ తానై పోషించి.. ప్రయోజకులను చేశాడు. అచ్చంపేటలో నివాసముంటున్న రేసోజు వామనమూర్తికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. పెద్దకుమారుడు నవీన్‌కుమార్ (ప్రైవేటు పాఠశాలలో హెచ్‌ఎం) ఎంఎస్సీ, బీఈడీ పూర్తి చేశాడు. చిన్న కుమారుడు మహేష్ వీఆర్‌ఏగా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నాడు. 28 ఏళ్ల క్రితం భార్య లక్ష్మి చనిపోయినా పిల్లల కోసం అన్నీ తానై కొడుకులు, కూతురును పెంచాడు. చాలా ఏళ్లపాటు పిల్లలకు భోజనం వండి, వడ్డించి, అన్ని పనులు చేసేవాడు. ఇంట్లో ఆడదిక్కు లేకున్నా వడ్రంగి పనులు చేస్తూ ఇద్దరు కుమారులను బాగా చదివించి ప్రయోజకులను చేశాడు. ప్రస్తుతం ఇద్దరు కుమారులకు వివాహాలు కాగా వచ్చిన కోడళ్లను కూతురులా చూసుకుంటూ అందరికీ చేదోడు వాదోడుగా ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నాడు వామనమూర్తి.

బాల్యం నుంచీ..

జీవితాంతం పిల్లల కోసం తపిస్తూ, వారి అభివృద్ధి కోసం పాటుపడే వ్యక్తే నాన్న. నా చిన్నతనంలోనే అమ్మ మరణించింది. బాల్యం నుంచి నాన్నే నాకు సర్వస్వం అయ్యారు. అన్నీ తానే అయ్యి మా బాగోగులు చూసుకున్నారు. నా జీవితంలో నాన్నే హీరో. ప్రస్తుత తరం పిల్లలు తమ తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని కోరుతున్నా. జిల్లా ప్రజలందరికీ ఫాదర్స్‌డే శుభాకాంక్షలు.

– మనోహర్, ఎస్పీ, నాగర్‌కర్నూల్



కాంగ్రెస్‌లోకి కూచుకుళ్ల

- శనివారం నాగం జనార్దన్‌రెడ్డితో ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి విస్తృత చర్చ
- కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఠాక్రే, టీపీసీసీ రేవంత్ సమక్షంలో భేటీ
- ఇరువురి మధ్య కుదిరిన సయోధ్య?



సాక్షి, నాగర్‌కర్నూల్: కాంగ్రెస్‌లో పార్టీలోకి ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి చేరేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. శనివారం హైదరాబాద్‌లో మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డితో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి చర్చలు జరిపారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రేతో పాటు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో ఇరువురి మధ్య విస్తృతస్థాయిలో చర్చ జరిగినట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే విషయమై ఎవరికి వారు తమ అభిప్రాయాలను చెప్పగా.. చివరగా ఇరువురి మధ్య సయోధ్య కుదిరినట్లుగా తెలుస్తోంది. పార్టీ అధిష్ఠానం టికెట్ ఎవరికి ఇచ్చినా ఇరువురు నేతలు సంపూర్ణ మద్దతుతో సహకారం అందించుకోవాలని ముఖ్య నేతలు చెప్పినట్లు తెలిసింది. ఇక కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి త్వరలో కాంగ్రెస్‌లో చేరడం ఖాయమైనట్లు సమాచారం. మరో నాలుగైదు రోజుల్లోనే కాంగ్రెస్ అగ్రనేతల సమక్షంలో కూచుకుళ్ల కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్లు తెలుస్తోంది.

కలుసుకున్న పాత మిత్రులు

సుమారు రెండున్నర దశాబ్దాల తర్వాత నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఇరువురు ముఖ్యనేతలు కలుసుకోవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. కాంగ్రెస్‌లో రాష్ట్ర ఉన్నత స్థాయి నేతల సమక్షంలో శనివారం జరిగిన భేటీలో ఇరువురి మధ్య సయోధ్య కుదిరి మళ్లీ కలసిపోనున్నట్లు తెలుస్తోంది. కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి మొదటి నుంచి నాగం జనార్దన్‌రెడ్డికి ముఖ్య అనుచరుడిగా కొనసాగారు. 1983 అసెంబ్లీ ఎన్నికల్లో నాగం టీడీపీ నుంచి పోటీ చేసినప్పుడు కూచుకుళ్ల ఆయన కోసం పనిచేశారు. అనంతరం 1998 సంవత్సరం వరకు నాగం వెంటే ఉండి ఆయనకు మద్దతుగా నిలిచారు.1999 ఎన్నికల సమయంలో నాగంతో విభేదించిన కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత బలపడనున్న వీరి బంధం ఎలాంటి ప్రభావం చూపనుందోననే అంశంపై ఆసక్తి నెలకొంది.

ఎన్నికల ఏడాదిలో బీఆర్‌ఎస్‌కు షాక్ ..

సరిగ్గా ఎన్నికలకు ఆరు నెలల సమయం ఉన్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతుండటంపై జోరుగా చర్చ సాగుతోంది. గత ఎన్నికల్లో ఆయన ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి మద్దతుగా నిలిచారు. ఈసారి ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తే నియోజకవర్గంలో ఎలాంటి ప్రభావం చూపుతుందోనని బీఆర్‌ఎస్ శ్రేణులు అంచనా వేస్తున్నాయి. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి పార్టీలో కలవడం తమకు ఎంతో కలసివస్తుందని కాంగ్రెస్ శ్రేణులు భావిస్తుండగా, ఆయన పార్టీ మారినా తమకు ఢోకా ఉండదని బీఆర్‌ఎస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహించాలి

నారాయణపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ధ్యేయంగా ప్రతీ ఉపాధ్యాయుడు ప్రణాళికబద్ధంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. సింగారం క్రాస్‌రోడ్డులోని స్కిల్ డెవలప్‌మెంట్ భవనంలో శనివారం నారాయణపేట, నర్వ మండల టీచర్లకు నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. పిల్లలకు మనం చెప్పే ప్రతీ విషయం టీచర్ ముందుగా పాటించాలని, స్కూల్‌కి ఆలస్యంగా రావడాన్ని సహించబోమని చెప్పారు. రోజువారి ప్రణాళికతో విద్యాబోధన జరగాలని, సమయానికి పరీక్షలు నిర్వహించాలన్నారు. పాఠ్యాంశ బోధనకు టీఎల్‌ఎం ఉపయోగించాలని సూచించారు. ఎఫ్‌ఎల్‌ఎన్, లిప్‌లపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో డీఈఓ రవిందర్, ఏఎంఓ విద్యాసాగర్, టీచర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాలు సహకరించాలి..

ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న ఖాళీలను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేసేందుకు చేపడుతున్న వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ప్రక్రియకు ఉపాధ్యాయ సంఘాలు సహకరించాలని కలెక్టర్ శ్రీహర్ష కోరారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో వివిధ టీచర్స్ యూనియన్ నేతలతో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌కు ఐదుగురు సీనియర్ జీహెచ్‌ఎంలతో కమిటీ వేశామని, ముందుగా ఉన్నత పాఠశాలల్లో అత్యవసరమైన చోట్ల సబ్జెక్టుకు సంబంధించిన టీచర్లతో సర్దుబాటు చేస్తున్నట్లు చెప్పారు. సీనియర్, జూనియర్‌తో సంబంధం లేకుండా సబ్జెక్టు నీడ్‌ను దృష్టిలో ఉంచుకుని చేస్తున్నారని, తప్పకుండా ఆర్డర్స్‌ను టీచర్లు పాటించాలని, ఎలాంటి రెకమండేషన్లు తీసుకుని రావద్దన్నారు. విద్యావ్యవస్థ బాగుకు సహకరించాలన్నారు. కొత్త విద్యార్థుల చేరిక తర్వాత పీఎస్, యూపీఎస్‌లకు సైతం టీచర్లను కేటాయిస్తామని, పీటీఐల సేవలను సద్వినియోగం చేసుకుంటామన్నారు. అప్పటికి అవసరమైతే స్వచ్ఛంద సంస్థ సహకారంతో వలంటీర్లను అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. అదేవిధంగా ఈనెల 20న జరిగే తెలంగాణ దశాబ్ది ఉత్సవాల విద్యా దినోత్సవం విజయవంతం చేయడానికి అందరి సహకారం ఉండాలన్నారు.

తండాల అభివృద్ధి కేసీఆర్ ఘనతే



మహారాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

- మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తాం
- ముంబై గిరిజన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట: బీహార్, యూపీ, చత్తీస్‌గఢ్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ నుంచి చాలామంది ఉపాధి కోసం తెలంగాణకు వలస వస్తున్నారని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. నా అన్నదమ్ములు ఇక్కడ ఉన్నారని వచ్చాను.. ఓట్ల కోసం రాలేదని అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం ముంబైలోని వాషి సెక్టార్–16లోని విష్ణు దాస్ భవే ఆడిటోరియంలో నిర్వహించిన గిరిజన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఊరేగింపుగా వెళ్లి ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అలాగే బీఆర్‌ఎస్ పార్టీ స్థానిక నాయకులు హాజరయ్యారు. ముంబై, పూణె, బెంగళూర్, సూరత్ వంటి మహానగరాల్లో స్థిరపడిన, వివిధ రంగాల్లో రాణిస్తున్న తెలంగాణ ప్రజలు మీ ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి కలిసి రావాలని కోరారు. ఆదివారం పూణెలో, రానున్న రోజుల్లో బెంగళూర్, సూరత్ వంటి ప్రాంతాల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తామని చెప్పారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గిరిజన దినోత్సవాన్ని ముంబైలో నిర్వహించడం ఎంతో సంతోషకరమన్నారు. పెద్దఎత్తున ఆదరణ వస్తోందని అన్నారు. తెలంగాణలో వలసలకు ప్రతిపక్ష పార్టీలే కారణమని విమర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీని ఆదరిస్తే, అండగా ఉంటామని, ఏ సమస్య ఉన్నా క్షణాల్లో పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నారాయణపేట నియోజకవర్గం నాయకులు రవికుమార్, వేపూరి రాములు, మురళీధర్‌రెడ్డి, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య యాదవ్, మహేశ్, బుల్లెట్ రాజు, సిద్దు చౌహన్, రమేశ్‌నాయక్, మాధవరెడ్డి, ప్రసాద్ బాబు, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

నారాయణపేట టౌన్: ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ సీనియర్ నాయకులు వెంకట్రామిరెడ్డి, కన్వీనర్ బాల్‌రాం డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా విద్యాధికారి కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉండడం వల్ల కార్మికులు ఇబ్బందిపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలన్నారు. కార్మికుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్న కొల్లంపల్లి పాఠశాల హెచ్‌ఎం సల్మాన్‌రాజుపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా విద్యాధికారి కార్యాలయ అధికారి యాదయ్యశెట్టికి అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటయ్య, మణెమ్మ, కోస్గి మాణిమాల, ఆశమ్మ, యాదమ్మ, శివలీల, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.



డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

క్లుప్తంగా

చికిత్స పొందుతూ మహిళ మృతి

అయిజ : చికిత్స పొందుతూ గుర్తు తెలియని ఓ మహిళ మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేష్‌కుమార్ కథనం మేరకు... తిక్కవీరేశ్వరస్వామి ఆలయ సమీపంలో సదరు మహిళ అనారోగ్యంతో శుక్రవారం కొట్టుమిట్టాడుతుండగా స్థానికులు గమనించి సమాచారం ఇచ్చారని, దీంతో వెంటనే 108లో గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించామన్నారు. ఈ క్రమంలో చికిత్సపొందుతూ శనివారం ఆమె మృతిచెందినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. కాగా గుర్తు తెలియని మహిళ మృతికింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు. ఆచూకీ తెలిసిన వారు అయిజ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

యువకుడి బలవన్మరణం

జడ్చర్ల: ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ రమేశ్‌బాబు కథనం మేరకు.. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల కేంద్రానికి చెందిన బైకని మణికంఠ(18) జడ్చర్లలోని ఫ్లెక్సీ తయారీ షాపులో పనిచేసేవాడు. అతడు స్థానిక గీతం స్కూల్ వెనుక కాలనీలో అద్దె గదిలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కాగా శనివారం ఉదయం తమకు తెలిసిన వ్యక్తి ప్రసాద్ ఫోన్ చేసి చెప్పాడని... దీంతో జడ్చర్ల ఆస్పత్రిలోని మార్చురీకి వచ్చి తమ కుమారుడి మృతదేహాన్ని చూశామని మణికంఠ తండ్రి బైకని జంగయ్య తెలిపారు. ఈ మేరకు తండ్రి ఫిర్యాదు చేయగా మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహింపజేసి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. కాగా మణికంఠ బలవన్మరణానికి కారణాలు తెలియరాలేదు. ఒక్కగానొక్క కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో అతడి తల్లిదండ్రులు బోరున విలపించారు.

జీవితంపై విరక్తితో..

జడ్చర్ల: జీవితంపై విరక్తితో ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రమేశ్‌బాబు కథనం మేరకు.. బండమీదిపల్లి గ్రామానికి చెందిన ఊరగుంట లలిత(24) కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో కళ్లు కూడా కనిపించని పరిస్థితి ఏర్పడింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె ఆత్మహత్య చేసుకోవాలనుకుంది. శుక్రవారం ఇంట్లో ఎవరూ.. లేని సమయంలో బాత్‌రూమ్‌లు శుభ్రపరిచే ద్రావణం తాగింది. ఈ క్రమంలో నురగలు కక్కుకుని ఉండగా తల్లిదండ్రులు గమనించి చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె శనివారం మృతి చెందింది. ఘటనపై ఆమె తండ్రి బుడ్డయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కుటుంబ సభ్యుల గొడవతో మనస్తాపానికి గురై..

బిజినేపల్లి : మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. తిమ్మాజీపేట మండలంలోని గుమ్మకొండ గ్రామానికి చెందిన బైరపాగ పరుశరాం (38)కు శుక్రవారం సాయంత్రం కుటుంబ సభ్యులతో గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన అతడు ఇంట్లో ఉరేసుకున్నాడు. విషయం గమనించిన అతడి భార్య పద్మ వెంటనే తలుపులు తెరిచి ఆస్పత్రికి తరలించినా అప్పటికే పరిస్థితి విషమించడంతో మరణించాడు. ఘటనపై శనివారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పరుశరాంకు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

కడుపునొప్పి భరించలేక..

కల్వకుర్తిరూరల్: కడుపునొప్పితో మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రమేశ్ కథనం ప్రకారం.. తర్నికల్ తండాకు చెందిన కేసి (50) కొంతకాలం నుంచి కడుపునొప్పితో బాధపడుతోంది. భరించలేక ఈ నెల 16న రాత్రి సమయంలో పురుగుల మందు తాగింది. ఈ క్రమంలో ఆమె భర్త భద్రు, కుటుంబ సభ్యులు చికిత్సనిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందింది. కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కొల్లాపూర్ రూరల్: పట్టణానికి చెందిన రంగదాసువీధిలో ఉంటున్న ఆవుల రామకృష్ణ (45) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. ఎస్‌ఐ బాల వెంకటరమణ చెప్పిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులతో మద్యం మత్తులో గొడవపడ్డాడు. శనివారం ఉదయం కుటుంబసభ్యులు చూసే సరికి ఇంటి ముందు మృతి చెంది ఉన్నాడు. ఘటనపై మృతుడి చెల్లి జలగం పార్వతమ్మ ఫిర్యాదు మేరకు అనుమానితులు మృతుని భార్య తులసి, కూతురు మంజుల, అల్లుడు రాములుపై కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అడవిపంది దాడిలో రైతుకు తీవ్ర గాయాలు

మహమ్మదాబాద్: అడవిపంది దాడిలో రైతు తీవ్రంగా గాయపడిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఆముదాల గడ్డ తండాకు చెందిన కొత్త నర్సయ్య శనివారం ఉదయం పొలానికి వెళ్తున్నాడు. అదే సమయంలో ఎదురుగా ఓ అడవిపంది వచ్చింది. ఈ క్రమంలో నర్సయ్య దాని బారినుంచి తప్పించుకునే ప్రయత్నం చేయగా వెంబడించి దాడి చేసింది. ఘటనలో అతడు తీవ్రంగా గాయాలపాలై పడి ఉండడంతో విషయం గమనించిన ఇతర రైతులు వెంటనే 108 అంబులెన్సులో మహబూబ్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

స్వరాష్ట్రంలో నీటిగోసకు స్వస్తి

- రూ.284 కోట్ల వ్యయంతో ప్రాజెక్ట్
- జిల్లాలో 1,62,019 కుళాయిలు
- 1,647 కే.ఎం పైప్‌లైన్లు
- గ్రామగ్రామాన తాగునీటి విజయాలపై సభలు, ర్యాలీలు
- నేడు మంచినీళ్ల పండుగ



కోటకదిరలో మిషన్ భగీరథ నీటి సరఫరాను పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకటరమణ



కోటకదిరలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకటరమణ, సర్పంచ్ రమ్య, ఎంపీటీసీ దేవేందర్‌రెడ్డి

1,62,019 నల్లాలు...

జిల్లాలో మొత్తం ఇంట్రా విజేల్(గ్రామాల్లో అంతర్గత పైప్‌లైన్) వేసేందుకు 284 కోట్లు ప్రాజెక్ట్ అంచనా వేశారు. జిల్లాలో మొత్తం 441 గ్రామ పంచాయతీల ఉండగా ఇందులో 879 ఆవాసాలు ఉన్నాయి. 819 ఓవర్ హెడ్ ట్యాంక్‌లు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 1,254 కిలో మీటర్ల పొడవు పైప్ లైన్ వేశారు. మొత్తం 1,62,019 నల్లాలకు ద్వారా నీళ్లను సరఫరా చేస్తున్నారు. జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం 6,90,778 జనాభా ఉన్నారు. ఇందుకుగాను 1,62,019 ఇళ్లు ఉన్నాయి. ఇందులో 879 ఆవాసాలు ఉన్నాయి. ప్రతి మనిషికి గ్రామాల్లో 100 లీటర్ల చొప్పున నీళ్లను సరఫరా చేస్తున్నారు. మున్సిపాలిటీలలో 135 లీటర్లు, కార్పొరేషన్లలో 150 లీటర్ల చొప్పున నీళ్లను సరఫరా చేస్తున్నారు.

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఒకప్పుడు మంచి నీళ్ల కోసం ఓ చిన్నసైజు యుద్ధమే చేయాల్సి ఉండేది. జిల్లా కేంద్రంలో వారం రోజులకు ఒకసారి నల్లా నీళ్లు వచ్చేవి. కొన్నివార్డులలో 15 రోజులకు ఒకసారి సరఫరా అయ్యేవి. నీళ్లు వదిలినప్పుడే పట్టుకోవాలి.. లేదంటే మరో 15 రోజులు నీళ్ల కోసం ఆగాల్సిందే. గల్లీలోకి నీళ్ల ట్యాంకర్ వచ్చిందంటే కొట్లాటలు జరిగేవి. గతంలో తరచూ కనిపించే దృశ్యం ఇది. అలాంటిది స్వరాష్టం సిద్ధించిన తర్వాత ప్రతి ఇంటికీ నల్లా ద్వారా శుద్ధిచేసిన నీటి సరఫరా అవుతోంది. తాగునీరు ఇంటింటికీ ఇవ్వకపోతే ఓట్లు అడగబోనని ఎన్నికలకు ముందు సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. ఈ మేరకే మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టారు. హామీ నెరవేర్చారు. ఇందుకోసం ఇన్‌టెక్ వెల్ (ముడి నీళ్లు తీసుకునే ప్రాంతం) నాగర్‌కర్నూల్ జిల్లాలోని శ్రీశైలం బ్యాక్‌వాటర్ ఎల్లూర్ రిజర్వాయర్‌తోపాటు మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిల్‌సాగర్ నుంచి మిషన్ భగీరథ కోసం నీళ్లు తీసుకుంటున్నారు. జిల్లాలో రాష్ట ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాల మేరకు కలెక్టర్ రవినాయక్ పర్యవేక్షణలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ ఈ పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మిషన్ భగీరథ ప్రాజెక్ట్ 1,254 కిలోమీటర్ల పొడవు అంతర్గత పైప్‌లైన్ వేశారు. మొత్తం ప్రాజెక్టుకు ప్రభుత్వం రూ.284కోట్లు వెచ్చించి పూర్తి చేసింది.

తాగునీటి విజయంపై సభలు, ర్యాలీలు..

ఈనెల 18వ తేదీన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంచినీళ్ల పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని ప్రతి గ్రామంలో తాగునీటి విజయాలపై సభలు ర్యాలీలు నిర్వహిస్తారు. తెలంగాణ రాక ముందు నీళ్ల కోసం ప్రజలు ఎట్ల తిప్పలు పడ్డారో రాష్టం వచ్చినంక పరిస్థితి ఎట్ల ఉందనే అంశాలను ఫొటోలు చూపుతూ ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తారు. గ్రామాల్లో ఉన్న నీళ్ల ట్యాంకులకు విద్యుత్ దీపాలు వేసి అందంగా అలంకరిస్తారు. స్కూళ్లలో, పంచాయతీ కార్యాలయాల్లో రంగోళి ముగ్గుల పోటీలు నిర్వహించడం, ర్యాలీలు, సభలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు, ఉపన్యాసం క్యాటగిరీల్లో తెలుపొందిన వారికి ప్రశంసాపత్రాలు అందజేస్తారు.

మన్యంకొండలో నీళ్ల పండుగ..

జిల్లా వ్యాప్తంగా మంచినీళ్ల పండుగ జరుగనుంది. ఇందులో భాగంగా జిల్లాలో మూడు ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహిస్తారు. అందులో మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని మన్యంకొండలోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(డబ్ల్యూటీపీ) వద్ద నీళ్ల పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా పరిషత్ చైర్మన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, కలెక్టర్ రవినాయక్‌తో పాటు ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరవుతారు. మహబూబ్‌నగర్, దేవరకద్ర నియోజకవర్గాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. రెండోది జడ్చర్లలోని నాగసాలలో నిర్వహిస్తారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి హాజరవుతారు. మూడోది కోయిల్‌కొండలోని రాంకొండ ప్రాంతంలో నిర్వహిస్తారు. కార్యక్రమానికి నారాయణపేట ఎమ్మెల్యే ఎస్ఆర్‌రెడ్డి హాజరవుతారు.

467 ఎంఎల్‌డీ ముడి నీళ్లు సరఫరా..

జిల్లా వ్యాప్తంగా నీటిని అందించేందుకు 467 ఎంఎల్‌డీ ముడినీటిని నీటి శుద్ధి కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 11 నీటి శుద్ధి కేంద్రాలు ఉన్నాయి. అందులో నాగసాల (77ఎంఎల్‌డీ), మన్యంకొండ(70 ఎంఎల్‌డీ), కానాయపల్లి 20 ఎంఎల్‌డీ, ఎర్రగుట్ట 18 ఎంఎల్‌డీ, రాంకొండగుట్ట 19 ఎంఎల్‌డీ, రాఘవాపూర్ 135 ఎంఎల్‌డీ, మల్లెబోయిన్‌పల్లి 10 ఎంఎల్‌డీ, చందాపూర్ 9 ఎంఎల్‌డీ, కుర్మీహమ్మద్‌పల్లి 19 ఎంఎల్‌డీ, రాంరెడ్డిగూడెం 30 ఎంఎల్‌డీ, కల్వకుర్తి 60 ఎంఎల్‌డీ సామర్థం గల నీటిశుద్ధి కేంద్రాలు ఉన్నాయి. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీకి నాగసాల, రాంరెడ్డిగూడెం నుంచి నీళ్లు సరఫరా అవుతాయి. మహబూబ్‌నగర్ మండలానికి మన్యంకొండ, నాగసాల, రాంకొండల నుంచి, అడ్డాకులకు నాగసాల, మన్యంకొండ, కానాయిపల్లిల నుంచి, బాల్‌నగర్‌కు నాగసాల నుంచి, భూత్పూర్, భూత్పూర్ మున్సిపాలిటీలకు నాగసాల నుంచి, సీసీకుంటకు మన్యంకొడ, ఎర్రగట్టు నుంచి, దేవరకద్రకు మన్యంకొడ, రాంకొండగుట్ట, గండీడ్‌కు రాఘవాపూర్ నుంచి హన్వాడకు నాగసాల, రాంకొండగుట్ట, జడ్చర్ల, జడ్చర్ల మున్సిపాలిటీలకు నాగసాల నుంచి కోయిలకొండకు చందాపూర్, రాంకొండగుట్ట, మిడ్జిల్‌కు కల్వకుర్తి, ముసాపేట్‌కు నాగసాల, కానాయిపల్లి నుంచి నవాబ్‌పేట్‌కు నాగసాల, రాఘవపూర్ నుంచి, రాజాపూర్‌కు నాగసాల నీటిశుద్ధి కేంద్రాల నుంచి నీరు సరఫరా చేస్తున్నారు.

మిషన్ భగీరథ నీళ్లు శుద్ధజలం..

ఇంటింటికీ నల్లా ద్వారా మిషన్ భగీరథ ద్వారా శుద్ధజలం సరఫరా చేస్తున్నాం. నీళ్ల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ప్రజలకు అత్యంత శ్రేష్టమైన నీళ్లు తని ప్రజల్లో అవగాహన కల్పిస్తునే క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తెలుసుకుని పరిష్కరిస్తున్నాం. మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కలెక్టర్ రవినాయక్ ఆదేశాల మేరకు నీటి సరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా సరఫరా చేస్తున్నాం.
– కె. వెంకటరమణ, మిషన్ భగీరథ ఎస్ఈ

బాధిత కుటుంబ సభ్యులను ఆదుకోవాలి



అచ్చంపేటలో రాస్తారోకో చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

అచ్చంపేట రూరల్: కారు ప్రమాదంలో మృతి చెందిన మహిళల కుటుంబ సభ్యులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం అచ్చంపేటలోని వంద పడకల ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యులు, బంధువులు రాస్తారోకో చేశారు. ఉప్పునుంతల మండలం రాయిచేడు గ్రామ శివారులో ఇంటి ముందు కూర్చున్న మహిళలను కారుతో ఢీకొట్టడంతో అమృత, అనిత మృతి చెందారు. హుస్సేనమ్మ మరో మహిళ తీవ్రంగా గాయపడింది. బాధిత కుటుంబ సభ్యులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు గంటల పాటు రాస్తారోకో చేయడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి, వేరే మార్గం గుండా వాహనాలను పోలీసులు మళ్లించారు. డబ్బులు చెల్లిస్తానని కారు ప్రమాద కారకుడు ఒప్పుకోవడంతో అక్కడి నుంచి బాధిత కుటుంబ సభ్యులు వెళ్లిపోయారు. అలాగే నడింపల్లి గ్రామానికి చెందిన బిందు అనే చిన్నారి బాలికను టిప్పర్ ఢీకొట్టడంతో మృతి చెందిన సంఘటన తెలిసిందే. బాలిక కుటుంబ సభ్యులు కూడా రాస్తారోకో చేశారు. ఎస్ఎస్ఆర్ కంపెనీకి చెందిన టిప్పర్ కావడంతో యాజమాన్యం డబ్బులు చెల్లిస్తామని చెప్పడంతో రాస్తారోకో విరమించారు.


ముగ్గురిపై పాక్సో కేసు నమోదు

గద్వాల క్రైం: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(మైనర్)ను మాయమాటలు చెప్పి మోసం చేసిన సంఘటనలో ముగ్గురిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు. రెండ్రోజుల క్రితం మైనర్ బాలిక అదృశ్యమైనట్లు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, విచారణ చేసిన పోలీసులు అయిజకు చెందిన ఓ యువకుడుతో పాటు మరో ఇద్దరు మైనర్ బాలికను మోసం చేసినట్లు గుర్తించారు. ఆ మేరకు ముగ్గురిపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.


పంటల కవచం ట్రైకోడర్మ

- మొక్కలకు హాని కలిగించే శిలీంద్రాల నాశనం

పాడి-పంట
అధికారి సలహా: జాన్ సుధాకర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి



మొక్క వేర్లపై విరిడి శిలీంద్రం



యాంటిబయాసిస్(స్రవిస్తున్న విరిడిస్) శిలీంద్రాల నమూనాలు

నారాయణపేట: మొక్కలకు హాని కలిగించే శిలీంద్రాలను నాశనం చేసే ట్రైకోడర్మ శిలీంద్రంపై రైతులు సంపూర్ణంగా అవగాహన పెంచుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్‌సుధాకర్ సూచించారు. భూమిలో విత్తనాలు విత్తే సమయంలో గింజ నుంచి అంకురపు మొక్క, పూత, కాయ దశ వరకు పంటలకు రక్షణ కవచంగా ట్రైకోడర్మ శిలీంద్రం పనిచేస్తుందని జిల్లాలో ప్రధానంగా పండించే పంటలు కంది, జొన్న, పత్తి అన్ని కూరగాయల పంటలకు సోకే తెగుళ్ల నివారణలో సహాయకారిగా ట్రైకోడర్మ పనిచేస్తుందన్నారు.

పరాన్న జీవిగా పంటలకు మేలు..

ట్రైకోడర్మ ప్రజాతికి చెందిన జీవ నియంత్రణ శిలీంద్రం. మొక్కలకు హాని చేసే శిలీంద్రాలపై పరాన్నజీవిగా పంటలకు మేలు చేస్తుంది. సేంద్రియ పదార్థం ఉండే ఒక గ్రాము మట్టిలో 1000 వరకు ట్రైకోడర్మ శిలీంద్రాలను ఉత్పత్తి చేయడంతో ట్రైకోడర్మలు వృద్ధి చెందుతాయి. ప్రతికూల పరిస్థితుల్లో క్లామి డో స్పోర్లుగా మారి ఎనిమిదేళ్ల పాటు నేలలో నిల్వ ఉంటాయి.

ఉపయోగం ఇలా..

నేలలో పంట మొక్కలకు సంక్రమించే కాండం కుల్లు తెగులు, వడలు తెగులు, నారుకుల్లు తెగుళ్లను కలుగజేసే శిలీంద్రాలైన పిథీయం, ఫైటాప్‌దొర, ప్రిజేరియాం, మ్యాక్రోఫామినా, రైజోక్రొనియాలను సమర్థవంతంగా అరికడుతుంది. ఈ ప్రక్రియతో పంటల సాగులో తెగుళ్ల నివారణ జరిగి అధిక దిగుబడిని పెంచుతుంది.

పంటలపై ప్రయోజనం

హాని కలిగించే శిలీంద్రం మొక్కపై దాడి చేయకముందే వేర్లపై స్థావరం ఏర్పాటు చేసుకుని రక్షిస్తుంది. తెగుళ్లు కలిగించే శిలీంద్రాలు మొక్క వేర్లపై దాడికి పాల్పడితే మైకో పారసిటిజమ్ ప్రక్రియతో కైటినేజ్ అనే ఎంజైంను స్రవించి శిలీంద్రాల కణకవచాన్ని కరిగించి జీవద్రవం బయటకు తీసుకొచ్చి నాశనం చేస్తుంది.

విత్తన శుద్ధి ఇలా..

విత్తనాలు విత్తేముందు కిలో విత్తనాలకు 10 గ్రాముల ట్రైకొడర్మ విరిడిని కలిపి విత్తుకోవాలి. 100 కిలోల పెశువుల ఎరువులో 2 కిలోల ట్రైకోడర్మ విరిడిని కలిపి చెట్టు నీడలో వారం రోజులు మక్కనివ్వాలి. శిలీంద్రం బాగా వృద్ధి చెంది ఆకు పచ్చరంగులో మారిన తర్వాతనే పొలంలో చల్లాలి.

ఎక్కడ లభిస్తాయంటే..

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పాలెం, కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) మదనాపురం, సహాయ వ్యవసాయ సంచాలకులు, జీవ నియంత్రణ ప్రయోగశాల, అబ్దుల్‌ఖాదర్ దర్గా వద్ద మహబూబ్‌నగర్‌లో ట్రైకోడర్మ విరిడి పొడిని విక్రయిస్తారు.



చెన్నిపాడులోని ఈత చెట్టుకు అల్లుకున్న గిజిగాడి గూడు

గిజిగాడి గూడు కనువిందు

మానవపాడు: అందంలో గూడు నిర్మాణంలో గిజిగాడికి సాటిరారెవరు. గూడులో అమరికలో గిజిగాడు ప్రదర్శించే కళాత్మకత, నైపుణ్యం, నేర్పరితనం కంప్యూటర్ యుగంలో మానవుడికి కూడా సాధ్యం కానిది అంటే అతియోశక్తి కాదు. మండలంలో పలు గ్రామాల్లో వీటి గూళ్లు చెరువులోకి వంగిన తుమ్మ చెట్టు కొమ్మలకో... తాటి చెట్లకో.. ఈత చెట్లకో వేలాడుతూ ఆకట్టుకుంటున్నాయి. కొమ్మలకు వేలాడుతున్న గిజిగాడు గూడులు అందరిని మైమరపింపజేస్తాయి. పాములు, ఇతర శత్రువుల బారి నుంచి గుడ్లను పిల్లలని కాపాడటానికి రాత్రనక, పగలనక గూళ్లను రక్షణ కవచంలా తీర్చిదిద్దడంలో నేర్పిరి. మండలంలోని చెన్నిపాడులో (ఈత) చెట్లకు గిజిగాడి గూళ్లు దర్శనం మిచ్చాయి. ఈ దృశ్యాన్ని 'సాక్షి' తన కెమారాలో బంధించింది.

ఈతకు వెళ్లి తిరిగిరానిలోకాలకు..

చెరువులో మునిగి ఇంటర్ విద్యార్థి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: సరదాగా స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువు నీటీలో మునిగి ఇంటర్ విద్యార్థి మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వన్‌టౌన్ ఎస్‌ఐ రామకృష్ణ కథనం ప్రకారం..జిల్లా కేంద్రంలోని బండ్లగేరికి చెందిన వంశీ మనోజ్(17) ఇటీవలే ఇంటర్ పూర్తి చేశాడు. శనివారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి పట్టణంలోని కొత్త చెరువుకు ఈతకు వెళ్లాడు. స్నేహితులతో పాటు మొదట లోతు తక్కువగా ఉన్న ప్రాంతంలోని నీటిలోకి దిగినప్పటికీ ఆ తర్వాత ఎక్కువగా ఉన్న ప్రాంతం వైపు వెళ్లాడు. అతడికి ఈత రాకపోవడంతో మునిపోయి మృతి చెందాడు. స్థానికుల సాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. మనోజ్ పెద్దనాన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీసీఎం ఢీకొని యువకుడి మృతి



నెల్లిగోవర్ధన్ (ఫైల్)

రాజాపూర్: భార్యాభర్తలు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా వెనక నుంచి డీసీఎం ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం రాత్రి రాజాపూర్ శివారులో చోటుచేసుకుంది. ఆ వివరాలు.. రాజాపూర్ మండలం దొండ్లపల్లికి చెందిన నెల్లిగోవర్ధన్(28) అతని భార్య భవానితో కలిసి రాజాపూర్ నుంచి తన మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా కుచ్చర్‌కల్ రోడ్డులో సబ్‌స్టేషన్ వద్ద వెనక నుంచి డీసీఎం ఢీకొంది. నెల్లిగోవర్ధన్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతి చెందాడు. భార్య భవానికి కాలు విరగడంతో పాటు తలకు గాయాలు కావడంతో జిల్లా కేంద్రానికి చికిత్స నిమిత్తం తరలించారు. మృతుడికి నాలుగు నెలల క్రితమే వివాహమైందని స్థానికులు తెలిపారు. మృతుడు పోలేపల్లి సెజ్‌లోని అరబిందో పరిశ్రమలో పనిచేస్తుండేవాడని కుటుంబసభ్యులు తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: గుర్తుతెలియని మహిళ మృతదేహం మున్సిపాలిటీ పరిధిలోని నాగనూలు చెరువులో లభ్యమైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. నాగనులు చెరువులో దాదాపు 20 ఏళ్ల వయస్సు గల మహిళ మృతదేహం నీటిపై తెలియాడుతుండడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతదేహం ఎవరైనా గుర్తిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యుదాఘాతంతో పశువుల షెడ్ దగ్ధం

వెల్దండ: మండలంలోని తుమ్మలకుంటతండాకు చెందిన రామావత్ పత్యానాయక్‌కు చెందిన పశువుల షెడ్‌లో శనివారం ఉదయం విద్యుదాఘాతంతో దగ్ధమైంది. ఆ వివరాలు.. పశువుల షెడ్‌లో పశుగ్రాసం కత్తిరించడానికి ఉపయోగించే మిషన్‌కు విద్యుత్ సరఫరా అయ్యే సమయంలో ఒక్కసారిగా నిప్పురవ్వలు వచ్చాయి. దీంతో పక్కనే నిల్వ ఉన్న పశుగ్రాసానికి నిప్పంటుకుని వ్యాపించారు. వెంటనే గమనించిన రైతులు, షెడ్‌లో ఉన్న పశువులను బయటికి వదిలారు. అప్పటికే నిప్పంటుకుని రెండు పశువులకు తీవ్ర గాయాలయ్యాయి. పశుగ్రాసం మిషన్ పూర్తిగా కాలిపోయింది. దాదాపుగా రూ.60వేలు నష్టపోయినట్లు రైతులు పేర్కొన్నారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామస్తులు, బాధిత రైతులు కోరుతున్నారు.

కృష్ణానదికి పూజలు చేస్తున్న పల్లెగడ్డ రైతులు



వరుణ దేవా కరుణించు స్వామీ..

మరికల్: వర్షాల కోసం నింగివైపు కళ్లు కాయలు కాచేలా చూసిన వరుణుడు కరుణించకపోవడంతో పల్లెగడ్డ గ్రామ రైతులు శనివారం కృష్ణానదికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి పవిత్ర జలాలను తెచ్చి గ్రామ దేవతలకు జలాభిషేకం చేసి వరుణ దేవుడు కరుణించాలని పూజలు చేశారు. కార్యక్రమంలో శ్రీరాములు, వెంకటన్న, గోపాల్, రాములు, రాజప్ప, రాయుడు, నారాయణలు పాల్గొన్నారు.

వనపర్తి G.T. నారాయణ కోచింగ్ సెంటర్
గురుకుల, నవోదయ, సైనిక్ స్కూళ్లకు ప్రత్యేక కోచింగ్
Cell: 9440297132, 9550112654

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ One year 10th,inter,NIOS,TOSS, APOSS, Degree&PG, Year Wise Nagarjuna, SV University guidelines for B.Tech, Detained,Failed Students Cont: NICC KPHB Hyd. Ph: 9515390685, 8179882462

PLOT FOR SALE
■ జడ్చర్ల నుండి హైదరాబాద్ వెళ్ళే రోడ్ నందు DTCP లేఅవుట్ 40 No's, Size 36x50 200 చ.గ.గల ఓపెన్ ప్లాట్లు అమ్మబడును. M.రాము. సెల్: 9030588073.

LAND FOR SALE
■ For Sale 163 Acres Single-bit Prime Land, Clear Title, Road-Facing, Close to Vijayawada - Nagpur Express way, Excellent Environment for Living, Business and Agriculture, High Iron Soil. Nawabpet (V), Chityala (M), Bhupalpally (D), Contact: 7675868777, 7207314277, info@amodagroup.com

SERVICES

BUSINESS OFFER
■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషీన్స్ పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. ఫోన్:9310515624, 8800496710.

HEALTH CARE
ORTHOPEDIC SURGEON
■ డా॥యస్.రవితేజ రెడ్డి, M.S., (ORTHO) (KMC మణిపాల్) ఎముకలు, నరములు, వెన్నెముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు. కిరీష్ పాలీ క్లినిక్, ఆపోలో హాస్పిటల్ ప్రక్కన, 3వ లైన్, N.R.పేట, కర్నూలు. 08518 - 228886, 83412 88888

GYNECOLOGY
■ కార్తీక్ హాస్పిటల్, సంతోష్ నగర్ రోడ్, కర్నూలు. సంతాన సమస్యలు, అన్ని రకాల స్త్రీ వ్యాధులు, జనరల్, బి.పి. షుగర్ వ్యాధులకు ఉత్తమ చికిత్స. డా॥ యస్.చంద్రశేఖర్, M.D. ఫిజీషియన్, డా॥ పార్వతీ దేవి, M.D., DGO., స్త్రీ వ్యాధి, ల్యాపరోస్కోపి నిపుణులు. టైమింగ్స్: 10-8PM, 08518-226162

WANTED
■ చెన్నై అసురన్ సోప్స్, డిటర్జెంట్ పౌడర్ అన్ని రకాల లిక్విడ్లను ఏ.పి.& తెలంగాణ వ్యాప్తంగా విక్రయించడానికి ఏరియాల వారిగా డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. 73965 77077.
■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376.

■ షిర్డిసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, ఆయాలు, భార్యాభర్తలు, డ్రైవర్స్,సాయి మందిరములో పూజారి కావలెను. ఫోన్: 9391088831, 9246585901.
■ మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల ఫార్మా కంపెనీలో సెక్యూరిటీ గార్డులు కావలెను జీతం: 12000/- ఉచిత వసతి, భోజన సౌకర్యం, ESI, PF అదనం. ఫోన్: 6300881014.
■ గచ్చిబౌలి (తెల్లాపూర్)లో గల మా కంపెనీకి అనుభవం గల సెక్యూరిటీ గార్డులు కావలెను. 12 గంటలకు, జీతం: 18000/- ఉచిత భోజనం వసతి కలదు: 9701238229
■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం, జీ. 18K ఏజెంట్స్ కమీషన్ 6K ఫోన్: 9640258899
■ సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం:18000/-,రూమ్ ఫ్రీ. సంప్ర॥ శ్రీరామ లాడ్జి, మహబూబ్‌నగర్. సెల్: 8464885828, 8553008833, 6304488636
■ Wanted Telecallers, marketing Agents, Digital Marketing Executives & Field Executives for Real Estate Co. Ph: 7032471624.

FACULTY TEACHERS
■ WANTED to teach Nursery to 10th (E/M) Primary : EVS, ENG, MATHS High:MATHS, Bio, Social, Hindi, Physics Sal:6000 to 20,000 Cell:6300047459, 9885750467
■ Req. Young Teachers (VI-X Maths & Physics) Tutor Cum Warden to Stay in Res-School Hostel & Work Hayathnagar & Champapet, Hyd. Ph:9000775299, 8143630236

సాక్షి ద్వారా మీ వారికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి కేవలం రూ. 500/-

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు ... - సాక్షి మేనేజ్‌మెంట్

భవిత విద్యార్థుల కోసం


సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా దంపతులను సన్మానిస్తున్న న్యాయవాదులు

'ఏపీ నాకు ఎంతో ప్రత్యేకమైంది'

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రజలు, న్యాయమూర్తులు, న్యాయవాదులు తనపై చూపిన ప్రేమాభిమానాలు చూసి తాను చలించిపోయానని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా పనిచేసిన కాలం తన జీవితంలోనే మరిచిపోలేని సమయమని ఆయన తెలిపారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన సందర్భంగా జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాకు హైకోర్టు న్యాయవాదులు శనివారం గుంటూరు పరిధిలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, పూర్వ ఏసీజే జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, హైకోర్టు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి ఉప్పును పండించవచ్చు



కృష్ణాజిల్లా నాగాయలంక వద్ద సముద్ర తీరంలో పెరిగిన సాలికోర్నియా మొక్కలు, వీటితో తయారుచేసిన సలాడ్స్

- సముద్ర తీరంలో మాత్రమే పెరిగే సాలికోర్నియా మొక్కలు
- వీటినుంచి ఉప్పును తీసుకోవచ్చు
- ఈ మొక్కలనే నేరుగా వంటకాల్లో వాడుకోవచ్చు
- వీటినుంచి ఇంధనం సైతం తీయొచ్చు
- ఉప్పునీటి చెరువుల్లో ఆక్వా సాగు చేసే రైతులకు కొత్త ఉపాధి

సాక్షి, అమరావతి: సాలికోర్నియా.. సముద్ర తీరం వెంబడి ఉప్పునీటి ప్రాంతాల్లో విస్తారంగా పెరిగే ఈ మొక్కలను సంప్రదాయ ఉప్పునకు ప్రత్యామ్నాయంగా ఉపయోగిస్తున్నారు. ఈ మొక్కల నుంచి ఉత్పత్తి చేసే ఇంధనాన్ని విమానాల్లో సైతం ప్రయోగాత్మకంగా వినియోగిస్తున్నారు. సముద్రతీర ప్రాంతాల్లో ఉప్పును తట్టుకుని పుష్పించే మొక్కల జాతికి చెందిన సాలికోర్నియా మొక్కల్లో 50 శాతం వరకు సోడియం క్లోరైడ్ నిండి ఉంటుంది. ఇందులోని లవణీయత సంప్రదాయ సముద్ర ఉప్పు రుచిని కలిగి ఉంటుంది. వీటి నుంచి తీసే ఉప్పును హెర్బల్ సాల్ట్, గ్రీన్ సాల్ట్‌గా పిలుస్తున్నారు.

ప్రొటీన్లు.. విటమిన్లూ ఉన్నాయ్

సాలికోర్నియా మొక్కల్లో 11 శాతం ప్రొటీన్లు, 20 శాతం ఫైబర్, జింక్, పొటాషియం, ఏ, బీ-1, బీ-12, బీ-15, సీ, ఈ విటమిన్లు అపారంగా ఉన్నాయని పరిశోధనల్లో గుర్తించారు. రక్తపోటు, మధుమేహం, గ్యాస్ట్రిక్ సంబంధిత వ్యాధులతో బాధపడే వారు ఈ గ్రీన్ సాల్ట్ తినేందుకు ఆసక్తి చూపిస్తున్నారు చాలా దేశాల్లో ఈ మొక్క నుంచి ఉత్పత్తి చేసే ఉప్పును అన్ని వంటకాల్లో వాడుతున్నారు.

సీఎస్ఎంసీఆర్ఐ సాంకేతిక సహకారం

గుజరాత్ భావనగర్‌లోని సెంట్రల్ సాల్ట్ అండ్ మెరైన్ కెమికల్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎస్ఎంసీఆర్ఐ) సాలికోర్నియా మొక్కల నుంచి ఉప్పు తయారు చేసే టెక్నాలజీని కనుగొంది. ప్రత్యామ్నాయ ఉప్పు తయారీకి సంబంధించిన అన్ని శాస్త్రీయ, సాంకేతిక సహాయాలను అందిస్తోంది. సాలికోర్నియా మొక్కల సాగు, కోత, మొక్కల్ని ఎండబెట్టడం, ఇతర ప్రక్రియల ద్వారా ఎకరాకు టన్ను ఉప్పు వస్తుందని సీఎస్ఎంసీఆర్ఐ చెబుతోంది. రూ.15 వేల పెట్టుబడితో రూ.25 వేలకు పైగా ఆదాయం వస్తుందని అంచనా వేసింది. ఈ మొక్కల నుంచి ఉత్పత్తి చేసే ఇంధనాన్ని సౌదీ దేశాలలో కొన్ని విమానయాన సంస్థలు ప్రయోగాత్మకంగా వినియోగిస్తున్నాయట.

ఏపీలోనూ సాగుకు అవకాశాలు

ఏపీలో 974 కిలోమీటర్ల సముద్రతీర ప్రాంతం ఉంది. కాకినాడ, మచిలీపట్నం ప్రాంతాల్లో పెద్దఎత్తున మడ అడవులు ఉన్నాయి. వాటిల్లో సాలికోర్నియా మొక్కలు విస్తారంగా ఉన్నట్టు గుర్తించారు. ముఖ్యంగా కృష్ణా జిల్లా తీర ప్రాంతంలో ఈ మొక్కల జాడను సీఎస్ఎంసీఆర్ఐ గుర్తించింది. ఉప్పునీటి చెరువుల్లో చేపలు, రొయ్యలు సాగుచేసే రైతులకు ప్రత్యామ్నాయ ఉపాధిగా సాలికోర్నియా మొక్కల సాగు నిలుస్తుందని చెబుతున్నారు. భవిష్యత్‌లో మంచి ఆదాయ వనరుగా ఈ మొక్కల సాగు మారే అవకాశం ఉంది.

ఈ నెల 22న 'దశాబ్ది దగా'

119 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నిరసన ర్యాలీలు

- బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలపై 10 తలలతో కేసీఆర్ దిష్టిబొమ్మల దహనం: టీపీసీసీ నిర్ణయం


గాంధీభవన్‌లో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఠాక్రే తదితరులు

సాక్షి, హైదరాబాద్: "తెలంగాణ రాష్ట్రం పదో ఏట అడుగుపెట్టిన సందర్భంగా దశాబ్ది ఉత్సవాల పేరుతో బీఆర్ఎస్ సొంత వ్యవహారం చేస్తోంది. ఈ తొమ్మిదేళ్లలో సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఇందుకోసం ఈ నెల 22న 'దశాబ్ది దగా'పేరిట రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ప్రత్యేక నిరసన కార్యక్రమాలు చేపట్టాలి. అన్ని నియోజకవర్గాల్లో నిరసన ర్యాలీలు నిర్వహించాలి. రావణాసురుడి రూపంలో కేసీఆర్ దిష్టిబొమ్మలను తయారు చేసి, పది వైఫల్యాల తలలు పెట్టి ఆ దిష్టిబొమ్మలను దహనం చేయాలి. తర్వాత ఆర్డీవో, ఎమ్మార్వో కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించాలి.." అని టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) నిర్ణయించింది. శనివారం గాంధీభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే అధ్యక్షతన పీఏసీ సమావేశం జరిగింది. ఇందులో తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ అంశాలపై చర్చించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్‌చౌదరి, విష్ణునాథ్, మన్సూర్‌అలీ ఖాన్, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి, పొదెం వీరయ్య, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, పీఏసీ సభ్యులు వీహెచ్, షబ్బీర్ అలీ, మహేశ్‌కుమార్‌గౌడ్, అంజన్‌కుమార్ యాదవ్, సంపత్‌కుమార్, చిన్నారెడ్డి, రేణుకా చౌదరి, బలరాం నాయక్ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. ఈసారి ఎన్నికల్లో బీసీలకు ఎన్ని సీట్లు ఇస్తారో, ఏయే సీట్లు ఇస్తారో వెంటనే గుర్తించాలని పీఏసీ భేటీలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్ కోరినట్టు తెలిసింది. 2018లో చాలా సీట్లు చివరి నిమిషంలో ప్రకటించడంతో నష్టం జరిగిందని పేర్కొన్నట్టు సమాచారం. ఇక ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్న వారికి పనితీరు, ప్రభావం ఆధారంగానే టికెట్లు ఇవ్వాలని, పార్టీని నమ్ముకుని ఉన్న వారికి అన్యాయం జరగకుండా చూడాలని వీహెచ్, రేణుకా చౌదరి సూచించినట్టు తెలిసింది.

పది రోజుల్లో మండల కమిటీలు

పీఏసీ భేటీ తర్వాత రేవంత్ మీడియాతో మాట్లాడారు. పార్టీ మండల కమిటీల ఏర్పాటుపై చాలా ప్రతిపాదనలు వచ్చాయని, వీటిపై చర్చించి 10 రోజుల్లోగా ప్రకటిస్తామని చెప్పారు. 'దశాబ్ది దగా'పేరిట బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు గుర్తుచేసేలా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. బీసీ డిక్లరేషన్, మహిళా, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ డిక్లరేషన్లలో ఏయే అంశాలను చేర్చాలన్న చర్చ జరుగుతోందని చెప్పారు. సీఎల్పీ నేత భట్టి పాదయాత్ర ముగింపు సందర్భంగా ఖమ్మంలో జాతీయస్థాయి నేతలతో కలిసి భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. తెలంగాణ ఏర్పాటై ఇన్నేళ్లయినా 600 మంది అమరుల కుటుంబాలను గుర్తించలేకపోయారని, బాధ్యత లేని మంత్రుల వ్యవహార శైలితో అమరుల ఆత్మలు ఘోషిస్తున్నాయని వ్యాఖ్యానించారు. కర్ణాటకలోని బీజేపీ, తెలంగాణలోని బీఆర్ఎస్‌కు దగ్గరి పోలిక ఉందని.. అక్కడ బీజేపీ 40 శాతం కమీషన్ సర్కార్ అయితే, ఇక్కడ బీఆర్ఎస్‌ది 30 శాతం కమీషన్ సర్కార్ అని రేవంత్ మండిపడ్డారు. కాంగ్రెస్‌లో చేరేందుకు చాలా మంది సిద్ధంగా ఉన్నారన్నారు.

అనుబంధ సంఘాల బాధ్యతలు కేటాయింపు

కాంగ్రెస్ అనుబంధ సంఘాల పర్యవేక్షణ బాధ్యతలను పలువురు టీపీసీసీ నేతలకు కేటాయిస్తూ రేవంత్ ఉత్తర్వులు జారీ చేశారు. మహేశ్‌కుమార్ గౌడ్ (సేవాదళ్, ఐఎన్‌టీయూసీ), గీతారెడ్డి (మహిళా కాంగ్రెస్), వినోద్‌రెడ్డి (యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ), మద్దుల గాల్‌రెడ్డి (ఎన్ఆర్ఐసెల్, ఓవర్సీస్)లకు బాధ్యతలను అప్పగించారు.

- టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, చావా రవి, మాణిక్‌రెడ్డి (యూటీఎఫ్), పోచయ్య (ఎస్‌టీఎఫ్), లింగారెడ్డి (డీటీఎఫ్), మురళీ (టీటీఎఫ్), గోపాల్, రఘునందన్, వెంకటయ్య, రవిశంకర్‌రెడ్డి తదితరులు గాంధీభవన్‌లో రేవంత్‌ను కలిసి ఉపాధ్యాయుల సమస్యలను వివరించారు. సీపీఎస్ రద్దు, ఏటా పదోన్నతులు, బదిలీల అంశాలను కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేర్చాలని కోరారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు చెరో 45 సీట్లు

కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్ర ప్రజల అభిప్రాయంలో భారీ మార్పు వచ్చిందని, కాంగ్రెస్ నిర్వహిస్తోన్న సర్వేల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు సమాన అవకాశాలు కనిపిస్తున్నాయని రేవంత్‌రెడ్డి చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు చెరో 45 సీట్లలో గెలిచే అవకాశాలున్నాయని, 15 చోట్ల రెండు పార్టీల మధ్య గట్టి పోటీ ఉందని చెప్పారు. బీఆర్ఎస్‌కు 37 శాతం ఓట్‌షేర్ వస్తే తమకు 35 శాతం వస్తోందని, బీజేపీ బలం 22 శాతం నుంచి 14 శాతానికి పడిపోయిందని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎంఐఎం, బీజేపీ చెరో ఏడు చోట్ల గెలిచే అవకాశం ఉందన్నారు. పౌరహక్కుల నేత హరగోపాల్‌పై కేసును వెనక్కి తీసుకుంటామన్న ప్రకటనను తాను నమ్మడం లేదని రేవంత్ వ్యాఖ్యానించారు. మోసం చేసేందుకే కేసీఆర్ కొన్ని ప్రకటనలు చేస్తుంటారన్నారు.

22న రాహుల్‌తో పొంగులేటి భేటీ?

- లేదంటే నెలాఖరులోపు సమావేశం.. జూలై మొదటి వారంలో ఖమ్మంలో సభ
- ఠాక్రేతో సమావేశమైన నాగం, కూచుకుళ్ల

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో చేరతారని భావిస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈనెల 22న లేదంటే నెలాఖరులోగా ఏదో ఒక రోజు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీతో సమావేశమయ్యే అవకాశముందని తెలుస్తోంది. ఈ నెల 21న రాహుల్ విదేశీ పర్యటన ముగించుకుని ఢిల్లీ రానున్న నేపథ్యంలో ఆయనతో భేటీ తర్వాతనే పొంగులేటి కాంగ్రెస్ పార్టీలో చేరే విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తారని గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాహుల్‌తో భేటీ అనంతరం ఖమ్మంలో జూలై మొదటి వారంలో భారీ బహిరంగ సభ నిర్వహించి పొంగులేటి, మహబూబ్‌నగర్‌లో సభ నిర్వహించి మాజీ మంత్రి జూపల్లి, వారి అనుచరులు కాంగ్రెస్ పార్టీలో చేరతారని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర ముగింపు సభ కూడా ఖమ్మం వేదికగా జరగనుంది. ఖమ్మంలో జరగనున్న ఈ రెండు సభలకు రాహుల్, ప్రియాంకాగాంధీలను ఆహ్వానించాలని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఈ మేరకు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తన పాదయాత్ర ముగింపు సభలో పాల్గొనాలని కోరుతూ రాహుల్, ప్రియాంకా గాంధీతో పాటు పార్టీ అధిష్టానానికి లేఖ రాశారు.

రాహుల్‌తో పొంగులేటి జూమ్ మీటింగ్?

ఇటీవల రాహుల్‌గాంధీతో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జూమ్ ద్వారా మాట్లాడారనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. రాహుల్‌గాంధీ విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన తర్వాతే పొంగులేటి, జూపల్లిల చేరిక తేదీలు ఖరారు కానున్నాయి.

ఠాక్రేతో నాగర్‌కర్నూల్ నేతల భేటీ

శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మాజీ మంత్రి నాగం జనార్దనరెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావ్ ఠాక్రేతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి పార్టీలో చేరిక, టికెట్ కేటాయింపు తదితర అంశాలపై చర్చ జరిగినట్టు తెలిసింది. భేటీ అనంతరం దామోదర్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరాలనే నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఆయన కూడా మహబూబ్‌నగర్‌లో జరిగే సభలోనే చేరనున్నట్టు తెలుస్తోంది.

బీఆర్ఎస్, బీజేపీ.. రెండూ ఒకటే

- రాష్ట్రంలో ఇతర పార్టీల ఉనికి లేకుండా చేయడమే వాటి లక్ష్యం
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటేనని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా నల్లగొండ ఎంపీడీఓ కార్యాలయ సమీపంలోని శిబిరం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. పరస్పర విమర్శలు బీజేపీ, బీఆర్ఎస్‌లు కలసి ఆడుతున్న నాటకంలో భాగమేనని ధ్వజమెత్తారు. ఈ పార్టీలు రాష్ట్రంలో ఇతర రాజకీయ పార్టీలకు ఉనికి లేకుండా చేయాలని కుట్ర పన్నాయన్నారు. ఆ పార్టీల కుట్రలను ఇప్పటికే కాంగ్రెస్ బయటపెట్టిందన్నారు. బడ్జెట్ సమావేశాలు, జాతీయ జెండా ఆవిష్కరణ వంటి ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎప్పుడూ గవర్నర్‌తో కలిసి పాల్గొనేందుకు ఇష్టపడని కేసీఆర్ ఇప్పుడు సయోధ్య కుదుర్చుకొని, చిరునవ్వులు నవ్వుతూ గవర్నర్‌తో కలసి పోవడంతో.. కేసీఆర్ గురించి తెలంగాణ సమాజానికి పూర్తిగా అర్థమైందన్నారు. నియంతృత్వ పోకడలతో ఫాసిస్టు పాలన సాగిస్తున్న మోదీ, కేసీఆర్‌లను వదిలించుకుంటే తప్ప తమకు స్వేచ్ఛ ఉండదని ప్రజలు గ్రహించారన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో అంతా అవినీతేనని అన్నారు. ధరణితో భూ కుంభకోణాలు, హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లీజు అక్రమాలు, విలువైన భూముల అమ్మకాల్లో అవినీతి, కాళేశ్వరం అవినీతి, లిక్కర్‌స్కాం చిట్టా తమ వద్ద ఉందని మాట్లాడిన అమిత్‌షా, మోదీలు ఇప్పటివరకు కేసీఆర్‌పై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌లోకి వెళ్లిన నాయకులు కేసీఆర్ అసలు స్వరూపం తెలుసుకుని పెద్దఎత్తున మళ్లీ కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమవుతున్నారన్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మొదలు పెట్టి 3 నెలలు దాటుతోందని, రాష్ట్ర ప్రజలకు సంబంధించిన గుండె చప్పుడు, వారి ఆవేదనను మీడియా సాక్షిగా తెలంగాణ సమాజానికి తెలియజెప్పే ప్రయత్నం చేస్తున్నానన్నారు. మీడియా సమావేశంలో నల్లగొండ పట్టణ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వంగూరి లక్ష్మయ్య, నల్లగొండ ఎంపీపీ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పీయూలో జెనిటిక్స్‌పై అవగాహన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో శనివారం విద్యార్థులకు జెనిటిక్స్‌పై కేంద్ర ప్రభుత్వం, విశ్వేశ్వరయ్య ఇండస్ట్రీస్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండు రోజుల పాటు సైన్స్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. బస్సును పీయూ ప్రిన్సిపాల్ కిషోర్, కంట్రోలర్ రాజ్‌కుమార్ తదితరులు సందర్శించారు.

వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు


పీయూలో ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న అధ్యాపకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని పాలమూరు యూనివర్సిటీలో విద్యార్థులకు శనివారం వ్యాసరచన, పెయింటింగ్, ముగ్గులు, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగ పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటారు. ప్రిన్సిపాల్ కిశోర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువులతో పాటు ప్రతిభను నిరూపించుకునేందుకు ఇటువంటి పోటీలు ఎంతో అవసరం అన్నారు.

మహిళలకు ఒకరోజు శిక్షణ

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లిలో శనివారం మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మునగాకు విలువ ఆధారిత ఉత్పత్తులపై మహిళలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త అనిత మునగాకుతో ఆరోగ్య లాభాలు, విలువ ఆధారిత ఉత్పత్తులతో గ్రామాల్లో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. కుటీర పరిశ్రమల ఏర్పాటుకు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సహకారం అందిస్తామని ఏపీఎం వెంకన్న తెలిపారు. కార్యక్రమంలో సిద్దయ్య, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్రయాణికులకు ఆర్టీసీ సదావకాశం

- నేటి నుంచి టీ-9 టికెట్లు అందుబాటులోకి..
- మహిళలు, సీనియర్ సిటిజన్లకు
- పల్లెవెలుగు బస్సుల్లో 60 కిలోమీటర్ల రాను, పోను ప్రయాణం



మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణీకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ సంస్థ ఎన్నో వెసులుబాట్లు కల్పిస్తుంది. కొత్తగా టీ-9 టికెట్ అందుబాటులోకి తెచ్చింది. గ్రామీణ, పట్టణ మహిళలు, వయోవృద్ధులకు (సీనియర్ సిటిజన్లు) బస్సు ప్రయాణాల్లో ఆర్థికభారం తగ్గించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. తొలిసారిగా జిల్లాల పరిధిలో పల్లె వెలుగు బస్సుల్లో ఆదివారం నుంచి టీ-9 టికెట్లు ప్రయాణికులకు అందుబాటులో రానున్నాయి.

రూ.100తో 60 కిలోమీటర్ల వరకు ప్రయాణం

మహిళలు, సీనియర్ సిటిజన్లు రూ.100లతో టీ-9 టికెట్ కొనుగోలు చేస్తే పల్లె వెలుగు బస్సుల్లో 60 కిలోమీటర్ల వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రాను, పోను ప్రయాణించే వెసులుబాటు లభిస్తుంది. దీంతో ఒక్కొక్కరికి రూ.20 నుంచి రూ.40 వరకు ఆదా అవుతుంది. పల్లె వెలుగు బస్సుల కండక్టర్ వద్ద టికెట్ అందుబాటులో ఉంటుంది.

అవకాశాన్ని వినియోగించుకోండి

మహిళలు, సీనియర్ సిటిజన్ల సౌకర్యార్థం టీ-9 టికెట్ అందుబాటులోకి తెచ్చాం. ఆదివారం నుంచి అన్ని డిపోల్లో అందుబాటులో ఉంటాయి. మహిళలు, సీనియర్ సిటిజన్లు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఆయా డిపోల నుంచి 60 కిలోమీటర్లు ప్రయాణం చేసేవారికి చార్జీలో కొంత ఆదా అవుతుంది.


- శ్రీదేవి, ఆర్టీసీ రీజనల్ మేనేజర్, మహబూబ్‌నగర్

ఎంతో వెసులుబాటు..

మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌లో ఆయా డిపోల నుంచి 60కిలోమీటర్ల లోపు ప్రయాణం చేసేవారికి ఈ టికెట్‌తో ఎంతో వెసులుబాటు లభించనుంది. మహబూబ్‌నగర్ నుంచి వర్నె, గోరిట, ధన్వాడ, జీన్గురాల వరకు వరకు పల్లె వెలుగు బస్సులో టికెట్ రూ.60 ఉండగా టీ-9 టికెట్ తీసుకుంటే రాను, పోను రూ.20 ఆదా అవుతుంది. మహబూబ్‌నగర్ నుంచి ఆత్మకూర్ పల్లెవెలుగు బస్సులో రూ.70 టికెట్ ఉండగా, టీ-9 టికెట్‌తో రూ.40 ఆదా అవుతుంది.

బీసీ డిక్లరేషన్ ప్రకటించాలి

- చట్టసభల్లో సముచిత స్థానం కల్పించాలి
- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాజకీయ పార్టీలు అన్ని బీసీ డిక్లరేషన్ ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ శనివారం డిమాండ్ చేశారు. స్థానిక టీఎన్‌జీఓ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జనాభాలో బీసీలు సగభాగం ఉన్నారన్నారు. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాల్లో 7 బీసీలకు కేటాంచాలని పేర్కొన్నారు. అదేవిధంగా బీసీ రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం 50 శాతానికి పెంచాలని, చట్టసభల్లోనూ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బీసీ ప్రధాని అని చెప్పుకునే మోదీ ప్రభుత్వం బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. బీసీ కుల గణనను చేపట్టాలని డిమాండ్ చేశారు. కుల వృత్తుల వారికి రూ.లక్ష సాయం ఏమాత్రం సరిపోదని బీసీ బంధును అమలు చేసితీరాలని కోరారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో బీసీలకు రాష్ట్ర వ్యాప్తంగా 60 అసెంబ్లీ, 9 ఎంపీ సీట్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 9న హైదరాబాద్‌లో రాజకీయ ప్లీనరీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో బీసీల హక్కులకు సంబంధించిన విషయంపై విస్తృతంగా చర్చిస్తామన్నారు. డిక్లరేషన్ ప్రకటించని వాటిని బీసీ వ్యతిరేక పార్టీలుగా పరిగణిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకాల శ్యాంకుర్మ, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌యాదవ్, యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంశీముదిరాజ్, జిల్లా బీసీ విద్యార్థిసంఘం అధ్యక్షుడు దోమవెంకట్, మన్యం పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి


మాట్లాడుతున్న సత్యానారాయణరెడ్డి

పాలమూరు: ప్రభుత్వ వైద్యరంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమానికి ప్రతిఒక్కరూ పోరాటానికి సిద్ధం కావాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో శనివారం ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించడంతోపాటు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. వైద్యరంగంలో పనిచేస్తున్న కార్మికుల హక్కుల సాధన కోసం మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ దశాబ్దాలపాటు రాజీలేని పోరాటాలు నిర్వహించి, అనేక జీఓలు, చట్టాలను సాధించిందని గుర్తు చేశారు. అత్యవసర సేవ విభాగమైన వైద్యరంగంలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వ్యవస్థ కొనసాగడం బాధాకరమని, దీని ఫలితంగా ప్రభుత్వ సంకల్పానికి అనేక ఆటంకాలు ఎదురవుతాయని చెప్పారు. తక్షణమే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు భాస్కర్, కోటేశ్వర్ రెడ్డి, అరుణ్, వరప్రసాద్, కిషోర్ పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి


పంచాయతీ భవన నిర్మాణం పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: గిరిజనుల జీవితాల్లో వెలుగులు, జీవన ప్రమాణాల మెరుగుపడేలా వారి సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం తెల్లరాళ్లపల్లితండాలో నిర్వహించిన గిరిజన దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. గిరిజనుల ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాలను గౌరవిస్తూ వారి అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత 3,146 గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని తెలిపారు. గిరిజనుల పిల్లల ఉన్నతికి రాష్ట్రంలో 161 ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేశామని, హైదరాబాద్ నడిబొడ్డున సేవాలాల్ బంజారా భవన్ నిర్మించారన్నారు. పోడు భూములకు పట్టాలు, పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచడం వంటి విప్లవాత్మక నిర్ణయాలతో విద్య, ఉద్యోగ రంగాల్లో గణనీయమైన మార్పులకు నాంది పలికారని తెలిపారు. తండాల అభివృద్ధికి భారీగా నిధులు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ..

తండాలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి సర్పంచ్ శాంతమ్మతో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. నిబంధనల మేరకు నాణ్యతగా నిర్మాణం చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అంతకుముందు తండాకు వచ్చిన ఎమ్మెల్యేకు సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు నృత్యాలు చేస్తూ స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కూడా వారితో కలిసి నృత్యం చేశారు. ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, వీపనగండ్ల ఎంపీపీ కమ్మ లేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోంనాథ్ నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దామోదర్ రెడ్డి, శేఖర్, రైతుబంధు మండల కో-ఆర్డినేటర్ వెంకటయ్యనాయుడు, గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారి శ్రీనివాసులు, పీఆర్ ఈఈ మల్లయ్య, గిరిజన సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

22న బండి సంజయ్ రాక

ఆత్మకూర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఈ నెల 22న పట్టణంలో జరిగే బహిరంగసభకు హాజరవుతారని పార్టీ రాష్ట్ర నాయకుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి, వనపర్తి, నారాయణపేట జిల్లాల అధ్యక్షులు రాజవర్ధన్‌రెడ్డి, పగుడాకుల శ్రీనివాస్ తెలిపారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో అమరచింత, ఆత్మకూర్, మక్తల్, ఊట్కూర్, నర్వ మండలాల ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలోని బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సాయంత్రం 4 గంటలకు సభ ప్రారంభమవుతుందని.. రాష్ట్ర అధ్యక్షుడితో పాటు, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి తదితరులు హాజరవుతారని వివరించారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని.. నాయకులు, కార్యకర్తలు అధికారమే లక్ష్యంగా ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ హయాంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఇల్లిల్లూ తిరిగి ప్రజలకు వివరించాలని సూచించారు. బహిరంగసభకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మోదీ అభిమానులు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకులు ఊట్కూర్ భాస్కర్, రతంగ్‌పాండురెడ్డి, మాధవరెడ్డి, ప్రభాకరవర్ధన్, కర్నె స్వామి, రేచింతల శ్రీను, వెంకటేశ్వర్లు, అశ్విన్‌కుమార్, నరాల నారాయణ, మేర్వరాజు, నంబిరాజు, గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి మారుతీ సూపర్ క్యారీ మినీట్రక్


మార్కెట్లోకి విడుదల చేసిన నూతన వాహనం

పాలమూరు: మారుతీ కంపెనీ నుంచి మార్కెట్‌లోకి మరో నూతన మాడల్ వచ్చింది. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని మెట్టుగడ్డ దగ్గర ఉన్న షోరూంలో మారుతీ సూపర్ క్యారీ మినీట్రక్ కమర్షియల్ వాహనాన్ని శనివారం మారుతీ షోరూం ఎండీ బెక్కరి రాంరెడ్డి మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నూతన వాహనం సీఎన్‌జీ వర్షన్‌లో లభిస్తుందని, కె సిరీస్ ఇంజిన్ సదుపాయంలో చక్కటి మైలేజ్‌తో పికప్ కలిగి ఉందన్నారు. పెట్రోల్ వర్షన్‌లో 19.7 కిలోమీటర్లు, సీఎన్‌జీలో 26 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుందన్నారు. 1197సీసీతో 2900 ఆర్‌పీఎం కలిగి ఉందన్నారు. ఎక్స్‌షోరూం ధర పెట్రోల్ వాహనం రూ.5.15 లక్షలు, సీఎన్‌జీ రూ.6.15 లక్షలకు అందుబాటులో ఉందన్నారు. తక్షణ రుణ సదుపాయంలో భాగంగా వందశాతం ఫైనాన్స్ సౌకర్యం ఉందన్నారు. కార్యక్రమంలో సీఈఓ విక్రమ్, జనరల్ మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, రాజమూర్తి, తుకారాం, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.